



మంత్రి పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు ఆదేశించారు. ఆదివారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సోమవారం పరిగి, వికారాబాద్‌లో మంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో పలు అంశాలపై ఆదేశాలిచ్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పరిగి పట్టణ కేంద్రంలో వంద పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు భూమిపూజ చేస్తారని, అనంతరం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యాధికారులతో ఆస్పత్రుల పనితీరు, సదుపాయాలు తదితర అంశాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు. పర్యటనలో భాగంగా నూతనంగా నిర్మించిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు కాగ్నా వద్ద గంగా హారతి

తాండూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : అర్చక, పురోహితుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న(సోమవారం) సాయంత్రం 5.30 గంటలకు యాలాల మండలం కోకట్ గ్రామ సమీపంలో వంతెన పక్కన గంగా పూజ, మహాహారతి, గంగా దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ధర్మ జాగరణ సమితి ఆదివారం ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో హిందువులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. గంగా హారతిని ప్రతినెలా పౌర్ణమి రోజున నిర్వహిస్తున్నామని తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం

ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి



దగ్ధమైన పంటను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

పెద్దేముల్, మే 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో చెరుకు పంట దగ్ధమై నష్టపోయిన రైతు జితేందర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రైతులకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన జితేందర్‌రెడ్డి సుమారు మూడున్నర ఎకరాల్లో చెరుకుపంట సాగు చేస్తున్నాడు. పైన ఉన్న విద్యుత్ తీగలు వదులుగా ఉండడంతో ఒకదానికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో నిప్పు రవ్వలు చెరుకు పంటలో పడడంతో పంటమొత్తం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మహేందర్‌రెడ్డి ఆదివారం దగ్ధమైన పంటను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక తహసీల్దార్‌తో మాట్లాడి రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, వెంటనే కలెక్టర్‌కు నివేదిక అందజేయాలని సూచించారు. ట్రాన్స్‌కో డీఈఈతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అధైర్యపడొద్దని, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని రైతుకు భరోసా కల్పించారు. ఆయన వెంట నర్సింహులు, బలవంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బద్లాపూర్ తండాలో నీటి సమస్యకు చెక్



బోరు మోటార్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది, తండావాసులు

బషీరాబాద్, మే11 (ఆంధ్రజ్యోతి): 'తాగునీరు మహాప్రభో' శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ స్థానిక నాయకుడు కె.నరేందర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో బద్లాపూర్‌తండా పంచాయతీ కార్యదర్శి అమృతమ్మ బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించారు. మెకానిక్‌ను తీసుకువచ్చి స్థానికుల సహాయంతో బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించారు. నీటి సమస్యకు చెక్ పడడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.



ఉపాధిపై నిఘా!

పంచాయతీల వారీగా పర్యవేక్షణ కమిటీలు



- పనుల్లో పారదర్శకతకు పెద్దపీట
- మొక్కుబడి సామాజిక తనిఖీలకు స్వస్తి!
- అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టేలా చర్యలు
- జిల్లాలో 1,32,578 యాక్టివ్ జాబ్ కార్డులు
- ఈ ఏడాది సగానికి తగ్గిన పని దినాలు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) పనులపై ఇక నిఘా పెరగనుంది. ఉపాధి హామీ పనులను పర్యవేక్షించేందుకు గ్రామ పంచాయతీల వారీగా పర్యవేక్షణ (విజిలెన్స్ మానిటరింగ్) కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటివరకు గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించేవారు. చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు, అవినీతి చోటుచేసుకుంటే సామాజిక తనిఖీ బృందాల సభ్యులు మండలాల వారీగా నిర్వహించే సభల్లో అధికారుల దృష్టికి తీసుకువచ్చేవారు. సామాజిక తనిఖీలు కూడా సక్రమంగా నిర్వహించడం లేదని గుర్తించిన ప్రభుత్వం ఉపాధి హామీ పనుల్లో మరింత పారదర్శకత పెంపొందించేందుకు పంచాయతీల వారీగా నిఘా పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

వికారాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ స్థాయిలో ఉపాధి హామీ పనులపై పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. ఉపాధి హామీ పథకం ప్రారంభించి రెండు దశాబ్దాలు గడిచిపోయిన తర్వాత ఆ పనుల్లో పారదర్శకత పెరిగేందుకు ఈ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా 1,32,578 యాక్టివ్ ఉపాధి హామీ జాబ్ కార్డులుండగా, ఈ కార్డుల్లో నమోదైన 2,45,421 మంది కూలీలున్నారు. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 10,911 కుటుంబాలకు వంద రోజుల పని కల్పించగా కూలీలు రూ.237.26 సరాసరి వేతనం పొందారు. వేతన రూపంలో రూ.159.26 కోట్లు ఖర్చు చేయగా, మెటీరియల్ వ్యయం కింద రూ.102.96 కోట్లు ఖర్చు చేశారు.

అక్రమార్కులపై కంటితుడుపు చర్యలు

ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఈ పనులపై ప్రతిఏటా నిర్వహించే సామాజిక తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి వస్తున్నా చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి. నాలుగైదు సంవత్సరాలుగా సామాజిక తనిఖీలు కూడా మొక్కుబడిగా కొనసాగుతున్నాయి. ఎక్కడైనా నిధుల దుర్వినియోగం ఎక్కువగా జరిగితే సిబ్బందిపై తూతూమంత్రంగా చర్యలు

మిగతా 8వ పేజీలో...

భానుడి భగభగలు

- రోజురోజుకూ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు
- అల్లాడుతున్న మూగజీవాలు

దుద్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఎండలు దంచికొడుతున్నాయి. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ వేడిమికి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అయితే మూగ జీవాల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఎండ దెబ్బకు వీధి కుక్కలు, కాకులు, పావురాలు నీళ్ల కోసం, నీడ కోసం అల్లాడుతున్నాయి. ఇళ్లలోని చల్లని ప్రదేశాలను ఆశ్రయిస్తున్నాయి. ఒక్కోసారి మరుగుదొడ్లలో సేద తీరుతున్నాయి. ఇంటి ముందు నీటిని ఉంచి మూగ జీవాల దాహార్తిని తీర్చాలని పలువురు జంతు ప్రేమికులు కోరుతున్నారు.

ఉష్ణోగ్రతలతో ఉక్కిరి బిక్కిరి

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉక్కపోత భరించలేక చెట్లను ఆశ్రయిస్తున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. పెండ్లీల సీజన్ కావడంతో తప్పని పరిస్థితుల్లో మండు టెండల్లోనూ ప్రయాణం చేయాల్సి వస్తుందని పలువురు చెబుతున్నారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



ఎండ వేడిమి తట్టుకోలేక మరుగుదొడ్డిలో సేద తీరుతున్న శునకాలు

కేంద్రాల్లోనే ధాన్యం నిల్వలు

- లారీలు లేక మిల్లులకు తరలని వడ్లు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



ఇప్పాయిపల్లి కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు

కులకచర్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోవడంతో ధాన్యం తెచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కులకచర్ల మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో తొమ్మిది, ఐకేపీ ఆధ్వర్యంలో మూడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అధికారులు 60 వేల క్వింటాళ్ల వరి ధాన్యం కోసం రైతులకు 1,350 టోకెన్లు అందించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి దాదాపు 15 రోజులు గడుస్తున్నా లారీలు రోజుకు ఒకటి, రెండు వస్తుండటంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. దాదాపు 10 రోజులకు ముందు ధాన్యం తెచ్చిన రైతులు లారీలు లేకపోవడంతో అక్కడే నిల్వ ఉంచుతున్నారు. శనివారం వరకు రోజూ ఒక లారీ మాత్రమే వచ్చేదని ఆదివారం ఒక్కటి కూడా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద 15 లారీల వరకు ధాన్యం బస్తాలు ఉన్నాయి. మరో పక్క వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బయట దళారులకు అమ్మితే తక్కువ ధర వస్తుందని, ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుండటంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి అమ్ముతున్నామని చెబుతున్నారు. లారీల కొరతతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకొని ఎక్కువ మొత్తంలో లారీలు పంపించి ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

నత్తే నయం!

పరిగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అసంపూర్తిగా నిర్మాణాలు

- రెండేళ్లు దాటినా పూర్తికాని వైనం.. నిర్మాణాల్లో నాణ్యతా లోపం
- రూ.లక్షల్లో ప్రజాధనం వృథా.. పట్టించుకోని అధికారులు



పరిగి సీహెచ్‌సీలో రెండేళ్లుగా కొనసాగుతున్న మార్చురీ భవన నిర్మాణం

పరిగి, మే 11(ఆంధ్రజ్యోతి): పరిగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అదనంగా నిర్మిస్తున్న భవనాలు, ప్రహరీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిర్మాణాలు ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. కొత్త మార్చురీ భవనం, ప్రహరీ, జనరేటర్ ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.1.42 కోట్లు మంజూరు చేసింది. ఈ నిర్మాణాలకు 29 ఏప్రిల్ 2023న బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన జరిగింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేళ్లు దాటినా అసంపూర్తిగానే వదిలేశారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల్లో నాణ్యత లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిర్మాణ పనులపై విచారణ జరిపించాలి



పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీ, ప్రహరీ నిర్మాణాలు రెండేళ్లుగా కొనసాగుతున్నాయి. పనుల్లో నాణ్యత లేదు. ఈ పనులపై విచారణ జరిపించాలి. రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన జనరేటర్ వినియోగంలో లేదు. నాణ్యత లేని పనులకు బిల్లులు నిలిపివేయాలి.

- షేర్‌మహ్మద్, సీపీఐ, పరిగి డివిజన్ కార్యదర్శి

అప్పుడే పగుళ్లు.. ప్యాచ్ వర్క్‌లు

టెండర్‌లో దక్కించుకున్న గుత్తేదారు రూ.30 లక్షల వ్యయంతో జనరేటర్ మాత్రమే ఏర్పాటు చేసి, మిగతా పనులను సబ్ గుత్తేదారుకు అప్పగించాడు. అతడు నిర్మాణంలో జాప్యం, నాణ్యత లేకుండానే పనులు చేపడుతున్నాడని స్థానికులు చెబుతున్నారు. రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మార్చురీ భవనం రెండేళ్లు పూర్తయినా అసంపూర్తిగానే ఉంది. పనుల్లో

మిగతా 8వ పేజీలో...



ప్రజలకు మెరుగైన

వైద్య సేవలు

- నేడు 300 పడకల ఆసుపత్రి ప్రారంభం
- ప్రారంభించనున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

7



అంగట్లో పనిముట్లు

రైతులకు తొలగిన ఇక్కట్లు!

7

పైసా వసూల్..

- టౌన్ ప్లానింగ్‌లో శానిటేషన్ జవాన్లు
- అధికారులుగా చలామణి అవుతున్న వైనం
- తాండూరు బల్దియాలో అక్రమార్కుల ఇష్టారాజ్యం
- పోస్టింగ్ ఇచ్చేందుకు ఓ అధికారికి మామూళ్లు !



తాండూరు మున్సిపల్ కార్యాలయం

తాండూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో ఎక్కడ నిర్మాణాలు జరిగినా టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఎంతోకొంత ముట్టజెప్పాల్సిందే.. లేదంటే తక్షణమే అక్కడ వాలిపోయి నిర్మాణదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో పని చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం తాండూరు మున్సిపాలిటీకే పరిమితం కాకుండా నాలుగు మున్సిపాలిటీలకు ఇన్‌చార్జిగా ఉండటంతో ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది ఆడిందే ఆటగా మారింది. మున్సిపాలిటీలో సుమారు 11 మంది శానిటేషన్ జవాన్లు ఉండగా ఇద్దరిని టౌన్ ప్లానింగ్‌కు కేటాయించారు. ఏళ్ల తరబడి టౌన్ ప్లానింగ్ శిక్షణలోనే ఉండటంతో వారే టౌన్ ప్లానింగ్ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. తాండూరు పట్టణంలోని సాయిపూర్, గ్రీన్‌సిటీ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలను ఆపాల్సిన సిబ్బంది నిర్మాణదారులతో చర్చలు జరిపి సెటిల్‌మెంట్ చేసుకుంటున్నారని ఆరోపణలున్నాయి.

బల్దియాలో వసూల్ సాబ్..!

టౌన్ ప్లానింగ్‌లో పని చేసేందుకు అధిక డిమాండ్ ఉంది. అక్కడ పని చేసేందుకు గాను బల్దియాలో ఒక అధికారికి డబ్బులు ముట్టచెప్పి పోస్టింగ్‌లు పొందారు. బల్దియాలో ఆ అధికారికి నేరుగా మాముళ్లు తీసుకువచ్చి ఇస్తున్నారని ఆరోపణలున్నాయి. అనుకూలమైన డ్యూటీలు వేసేందుకు ఆ అధికారి శానిటేషన్ సిబ్బంది నుంచి ఒక నెల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. శానిటేషన్ జవాన్లు శానిటేషన్ వ్యవహారాలు చూడకుండా టౌన్ ప్లానింగ్‌లో పాతుకుపోవడంతో మిగతా జవాన్లు మండిపడుతున్నారు. ఇటీవల టౌన్ ప్లానింగ్‌కు కొత్తగా మహిళా అధికారి బాధ్యతలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడటంతోపాటు ఏళ్ల తరబడి టౌన్ ప్లానింగ్‌లో పాతుకుపోయిన సిబ్బందిని శానిటేషన్ పర్యవేక్షణ పనులకు పంపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది కింది స్థాయి సిబ్బంది ట్రేడ్‌లైసెన్స్ జారీ, ఇంటి నంబర్ల కేటాయింపునకు సంబంధించి మున్సిపాలిటీకి వచ్చే ప్రజలకు త్వరితంగా పనులు చేయిస్తామని డబ్బులు తీసుకొని సంబంధిత అధికారులకు ముట్టజెపుతున్నారు. తాండూరు పట్టణంలో పలు అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు వచ్చినా అధికారులు స్పందించకపోవడంతో బాధితులు కోర్టులను ఆశ్రయించారు. అక్రమ నిర్మాణాలపై నోటీస్‌లు ఇవ్వడమే తప్ప ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలున్నాయి.

సైన్యానికి మద్దతుగా ప్రత్యేక పూజలు



మేడ్చల్ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం, సైన్యానికి మద్దతుగా ఆదివారం మేడ్చల్ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాకిస్థాన్ దుశ్చర్యలను తిప్పి కొడుతూ దేశ ప్రజల భద్రతను కాపాడటానికి పోరాడుతున్న భారత సైనికులు క్షేమంగా ఉండాలని కోరుతూ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు పూజలు నిర్వహిస్తున్నామని బీజేపీ పట్టణ అధ్యక్షురాలు శైలజాహరినాథ్ తెలిపారు. దేశ రక్షణలో ఇండియాకు పోటీ లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్ గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



క్రీడలకు ప్రోత్సాహం అభినందనీయం


రెడ్డిపల్లి జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న డీసీపీ శ్రీనివాస్

మొయినాబాద్ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనేక రంగాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు వారాంతాల్లో మొయినాబాద్ వైపు వచ్చి క్రీడలు ఆడుతున్నారని, క్రికెట్ మైదానాలకు మొయినాబాద్ ప్రత్యేక గుర్తింపు ఉందని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. అలాగే గ్రామాల్లోని క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. మొయినాబాద్ పరిధి అజీజ్‌నగర్‌లో 10 రోజులుగా పట్లోళ్ల వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం అతడి కుమారుడు చెన్నారెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో అజీజ్‌నగర్, రెడ్డిపల్లి జట్లు హోరాహోరిగా తలపడగా రెడ్డిపల్లి నిలిచింది. కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్ గెలుపొందిన జట్టుకు బహుమతి ప్రదానం చేశారు. క్రీడలను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామీణ క్రీడకారుల్లో మరింత నైపుణ్యం పెరుగుతుందని చెప్పారు. నగరంలో ఉండే వారు వారాంతాల్లో మొయినాబాద్‌వైపు రావడానికి గల ముఖ్యకారణం ఇక్కడ ఎక్కువ మైదనాలు ఉండడమేనని, ఇది స్థానిక క్రీడాకారులకు ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సై నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్, చెన్నరెడ్డి, బిందురెడ్డి, ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

సత్తా చాటిన వీఎస్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు

తాండూరు, మే 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం సర్వ కళాకారుల వేదిక నిర్వహించిన వందే జనని భారతి-సంగీత నృత్య నీరాజనం కార్యక్రమంలో తాండూరు వీఎస్ డ్యాన్స్ అకాడమీ కళాకారులు పాల్గొన్నారు. మాస్టర్ వెంకటేష్ శిక్షణలో 'ఓ సైనికా' అనే పాత్ర ద్వారా బాలలు అద్భుత ప్రదర్శనను అందించి ఆహూతుల ప్రశంసలు పొందారు. ప్రదర్శనలో సత్తాచాటిన వీఎస్ డ్యాన్స్ అకాడమీ కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.


ఉత్తమ ప్రదర్శన చేసిన వీఎస్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

చేవెళ్ల, మే 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జిల్లా అధ్యక్షుడు రామస్వామి అన్నారు. దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆయన చేవెళ్లలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం తర్వాత కార్మికులపై దాడి మొదలు పెట్టారని, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను పెట్టుబడి దారి వర్గానికి కొమ్ముకాస్తూ 4 కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గానికి అన్యాయం చేసిందన్నారు. 8గంటల పని దినాలను సాధించుకున్న కార్మికులు కేంద్ర ప్రభుత్వం 12గంటల పని దినాలను తీసుకువస్తున్నారని అన్నారు. ప్రతి కార్మికుడికి రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభులింగం, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సుధాకర్‌గౌడ్, శివ, శివయ్య, కృష్ణగౌడ్, శ్రీనివాస్, మంజుల, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌ను గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కేసు

షాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): మైనరును గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదయింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలానికి చెందిన ఓ బాలిక అనారోగ్యంతో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక ఎనిమిది నెలల గర్భవతి అని నిర్ధారించారు. తల్లిదండ్రులు నిలదీయడంతో ఇంటి పక్కనే ఉండే వరుసకు బాబాయి అయ్యే వ్యక్తి తనను గర్భవతిని చేశాడని బాలిక చెప్పింది. కాగా ఆ యువకుడికి అప్పటికే పెళ్లయింది. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపారు.

ఫాంహౌస్‌పై ఎక్సైజ్ పోలీసుల దాడి

● రూ.4లక్షల విలువైన మద్యం పట్టివేత



మొయినాబాద్, మే, 11 (ఆంధ్రజ్యోతి): ఓ ఫాంహౌస్‌పై ఎక్సైజ్ పోలీసులు దాడిచేసి రూ.4లక్షల విలువ చేసే ఢిల్లీ, గోవా రాష్ట్రాల నాన్ డ్యూటీ పేయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెయినాబాద్ మండలం తోలుకట్టలో హైదరాబాద్‌కు చెందిన తేజారెడ్డి ఫాంహౌస్‌లో శనివారం ఫంక్షన్ నిర్వహించారు. ఫంక్షన్‌లో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం వినియోగించారు. శంషాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు అర్ధరాత్రి ఫాంహౌస్‌పై దాడి చేశారు. ఢిల్లీకి చెందిన 50 బ్లాక్‌లేబుల్ బాటిల్లు, గోవాకు చెందిన 7లిక్కర్ బాటిల్లు, 12బీరు బాటిల్లు, తెలంగాణకు చెందిన 3 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఫంక్షన్‌లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగిస్తున్న నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

బీజేపీ బలోపేతానికి పని చేయాలి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న శోభ, రాములు దంపతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు

యాచారం, మే 11(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో బీజేపీని తిరుగులేని శక్తిగా మార్చడం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నల్లవెల్లికి చెందిన మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ నాయకులు జిల్ల శోభ, రాములు దంపతులు, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలకు కిషన్‌రెడ్డి శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని నాయకులను ఆదేశించారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు, నాయకులకు ఆదరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ జాతర




మేడ్చల్ టౌన్, మే11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి పూడూరు కట్టమైసమ్మ ఆలయ జాతరను ఆదివారం నిర్వహించారు. భక్తులు అమ్మ వారికి బోనాలు సమర్పించుకున్నారు. ఈ ఉత్సవాలు ఈనెల 15వ తేదీవరకు కొనసాగుతాయిని నిర్వాహకులు తెలిపారు.









పేదలను ఆదుకోవడమే ధ్యేయం


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న వజ్రేశ్‌యాదవ్

శామీర్‌పేట, మే 11(ఆంధ్రజ్యోతి): ఆపదలో పేదలను ఆదుకోవడమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని వజ్రేశ్‌యాదవ్ అన్నారు. మండలంలోని తూంకుంట మున్సిపల్ పరిధి దేవరయంజాల్‌కు చెందిన తలగామ గోపాల్‌కు రూ.32,500, బాబాగూడకు చెందిన దాసరి బలవంతరెడ్డికి రూ.43వేలు మంజూరైనట్లు తెలిపారు. చెక్కులను మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, హరికృష్ణ, బాణాల గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌడాపూర్: మండల కేంద్రంలో ఆదివారం పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అందజేశారు. చౌడాపూర్‌నకు చెందిన నాగమణికి రూ.1.2లక్షలు, నిఖితకు రూ.24 వేల విలువ గల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ్, రాము, యాదయ్య, యాదయ్య, రషీద్, కృష్ణయ్య, చిన్నయ్య, రమేశ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపు


రోడ్డు మూలమలుపులో ఉన్న చెట్లు

చౌడాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి మక్త వెంకటాపూర్ గ్రామాలకు మధ్య రోడ్డు మూల మలుపు ప్రమాదకరంగా మారింది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు పక్కన చెట్లు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పంట పొలాలకు స్వచ్ఛందంగా రోడ్డేసుకున్న రైతులు


సిరిపూరంలో పొలాల కోసం రైతులు వేసుకున్న మట్టి రోడ్డు

మర్పల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పాలకులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో రైతులు స్వచ్ఛందంగా మట్టి రోడ్డును వేసుకున్నారు. మండలంలోని సిరిపూరంలో దాదాపు వంద మంది రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు ప్రజాప్రతినిధులకు వివరించినా పట్టించుకోలేదు. పంటలు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడేదన్నారు. రైతులు ఏకమై డబ్బులు పోగు చేసి దాదాపు రూ.లక్షతో మట్టి రోడ్డును వేసుకున్నారు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూసినా ఫలితం లేకపోవడంతో తామే స్వచ్ఛందంగా రోడ్డును వేసుకున్నామని రైతులు తెలిపారు.

వైభవంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన


పెండ్లిమడుగులో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

వికారాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండ్లిమడుగులో శని, ఆదివారాల్లో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. యజ్ఞాలు, హోమాలు ఘనంగా చేశారు. అనంతరం బొడ్రాయిలో నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. పూర్తి ధార్మికతతో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నదానం నిర్వహించగా సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, భోజిరెడ్డి, జంగం నాగేశం, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఆమనగల్లు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీలోని గంగాభవానీ కాలనీలో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం పదో వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఎంగలి బాలకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, హోమాలు అభిషేకాలు, భజనలు నిర్వహించారు. హోమం, పూజల్లో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల హనుమ నామ స్మరణతో గంగాభవాని కాలనీ మార్మోగింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సత్తయ్య, కోశాధికారి సాయికుమార్, కార్యవర్గ సభ్యులు పరమేశ్, సుధాకర్, అప్పి, లింగం, ఈశ్వరయ్య, యాదగిరి, లింగప్ప, అశోక్, తదితరులు పాల్గొన్నారు.


ఆంజనేయ స్వామి పూజల్లో పాల్గొన్న నాయకులు

క్రీడల్లో గెలుపోటములు సహజం

పరిగి, మే 11 (ఆంధ్రజ్యోతి):క్రీడల్లో గెలుపోటములు సహజమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలో 40 రోజులుగా కొనసాగుతున్న పరిగి ప్రీమియర్ లీగ్(పీపీఎల్) క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. పరిగిలో ఇంత పెద్దస్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. గతంలోనే తాను మినీ స్టేడియంలో వాకింగ్ ట్రాక్, లైట్లు ఏర్పాటు చేశానని తెలిపారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధాంతి పార్థసారథి, ఎఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, కులకచర్ల చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, నాయకులు శ్రీనివాస్, ఎ.గోపాల్ పాల్గొన్నారు. అంతకుముందు విజేతలకు నగదు, జ్ఞాపికలను అందజేశారు.


క్రికెట్ పోటీల్లో విన్నర్ జట్టుతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఆటవిడుపు కేంద్రాలు..

వేసవి శిక్షణ శిబిరాలు

చిత్రలేఖనం, యోగ, ధ్యానాల్లో విద్యార్థుల సాధన .. సెలవుల సద్వినియోగం


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు


డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

కేశంపేట, మే 11(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యార్థుల సమయం వృథా కాకుండా విద్యాశాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణ రైజింగ్' పేరిట ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. వీటిల్లో విద్యార్థులకు ఆటా-పాటలు, వ్యాయామం, యోగా, ధ్యానం, డ్రాయింగ్ వంటివి నేర్పుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రమోట్‌లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు స్థానిక పాఠశాలల్లోనే వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. యోగా, ధ్యానం, చిత్రలేఖనం, కథలు చెప్పడం, చదరంగం, ఇండోర్ గేమ్స్, టీఎల్ఎం (టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) తయారీ, ఆటలు, కర్రసాము, అభినయ గీతాలు, పుస్తక పఠనం, గణిత మెలకువలు, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య అలవాట్లు, అందమైన చేతిరాత, స్పోకెన్ ఇంగ్లిష్ వంటివి నేర్పుతున్నారు. మండలంలో కొత్తపేట, కేశంపేట, పాపిరెడ్డిగూడ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఈ నెల 5న శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యా యి. ఉదయం 8 నుంచి 11గంటల వరకు శిబిరం కొనసాగుతుంది. శిబిరంలో విద్యార్థులకు స్నాక్స్, తాగునీరు ఇస్తున్నారు. ఈ మూడు శిక్షణ కేంద్రాల్లో 180 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ నెల 19 వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ప్రభుత్వం అ ందిస్తున్న శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

డ్రాయింగ్ ఎలా వేయాలో నేర్పించారు



ఈ ట్రైనింగ్ క్యాంప్‌లో మాకు డ్రాయింగ్ ఎలా వేయాలో నేర్పించారు. టెన్త్‌లో డ్రాయింగ్‌లు ఎక్కువగా వేయాల్సి ఉంటుంది. ఈ శిబిరం నాకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం నేను 9వ తరగతి పూర్తి చేసి పదో తరగతికి వెళ్తున్నా. శిబిరంలో చేతి రాతపై అవగహన కల్పించారు. స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్నారు. ఇలాంటి శిబిరాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి.

- సంజన, విద్యార్థిని, పాపిరెడ్డిగూడ

యోగ, ధ్యానం నేర్పిస్తున్నారు



వేసవి శిక్షణ శిబిరంలో యోగ, ధ్యానంతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని నేర్పిస్తున్నారు. వేసవిలో సమయం వృథా కాకుండా ప్రభుత్వం శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం బాగుంది. మా ఊరిలోనే శిక్షణ ఇస్తున్నారు. అందంగా రాయడం, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్నారు. ఈ శిబిరం నాకు ఎంతో ఉపయోగపడుతుంది. ఉదయం మాకు స్నాక్స్ కూడా ఇస్తున్నారు.

- అవంతిక, విద్యార్థిని, పాపిరెడ్డిగూడ

విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు



పాపిరెడ్డిగూడలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో విద్యార్థులు ఉత్సహంగా పాల్గొంటున్నారు. ఉదయం 8 గంటలకే శిబిరానికి వస్తున్నారు. వారి సౌకర్యం కోసం స్నాక్స్, తాగునీరు అందిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సైతం శిక్షణ శిబిరానికి వస్తున్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యక్తిత్వ వికాసం, స్పోకెన్‌ఇంగ్లిష్ వంటివి నేర్పిస్తున్నాం. ఇవన్నీ వారికి ఉపయోగపడేవే.

మల్లేశ్, సీఆర్పీ, పాపిరెడ్డిగూడ క్లస్టర్

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన చీఫ్ విప్

తాండూరు, మే 11(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఏఎస్‌జీఎంకే ట్రస్ట్ చైర్మన్ ముజీబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణతో పాటు వైద్య, కంటి పరీక్షల శిబిరాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి వారం హైదరాబాద్ నుంచి స్పెషలిస్టు వైద్యులు వచ్చి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు మందులూ అందించనున్నారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంపాదనలో కొంత పేదలకు, ఆపదలో ఉన్న వారికి వెచ్చించాలన్నారు. ట్రస్ట్ చైర్మన్ ముజీబ్ ఖాన్ సేవలు అభినందనీయమన్నారు. ముజీబ్ ఖాన్ మాట్లాడుతూ.. బీదలకు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కరుణం పురుషోత్తంరావు, డాక్టర్ సంపత్ కుమార్, అబ్దుల్ రవూఫ్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది


కుటుంబీకులతో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ములుగు జిల్లాలో మందుపాతర పేలి మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. మందుపాతర పేలుడుతో మృతిచెంది న గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ తిక్క సందీప్ నివాసం ఘట్‌కేసర్‌లో ఆదివారం రాత్రి కుంటుంబ సభ్యులను మహేందర్‌రెడ్డి పరామర్శించారు. మృతుల కుటంబాలకు ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, 300వందల గజాల ఇంటి స్థలం, ఒకరికి ఉద్యోగం ఇస్తున్నట్లు ప్రకటించిందని గుర్తుచేశారు. సందీప్ భార్య, తల్లితో మాట్లాడి ఓదార్చారు.

వేములనర్వలో గుప్తనిధుల వేట


గుప్త నిధుల కోసం తవ్విన భూమి

కేశంపేట, మే 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో రెండు మూడు రోజుల క్రితం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో తవ్వకాలు జరిపి అనంతరం గుంతను పూడ్చేశారు. ఆదివారం అటుగా వెళ్లిన కొందరు చూసి గ్రామస్తులకు తెలపడంతో నిధుల కోసమే తవ్వకాలు జరిపినట్లు చర్చించుకున్నారు. గతంలోనూ ఈ పొలంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారని గ్రామస్తులు తెలిపారు. మళ్లీ ఇలా తవ్వకాలు జరపడంతో ఈ విషయం గ్రామంలో కలకలం రేపింది. అక్కడ పూజలు నిర్వహించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని తెలిపారు. అక్కడ ఉన్న బండపై కుండకు సంబంధించిన పెంకులు కూడా ఉండడంతో గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో బీరప్ప గుడి కూడా ఉంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంట మార్పిడి.. ప్రయోజనకరం

- భూమిలోని పోషకాల పూర్తి వినియోగం
- చీడపీడలు, రోగాల నుంచి పైర్లకు రక్షణ
- రైతుకు తగ్గనున్న పెట్టుబడి ఖర్చు

యాచారం, మే 11(ఆంధ్రజ్యోతి): రైతులు పంటమార్పిడి విధానంతో ఎక్కువ దిగుబడి సాధించడంతో పాటు చీడపీల నివారనతో పెట్టుబడి ఖర్చుతూ గణనీయంగా తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతీ పంటకు పంట మార్పిడి పద్ధతి పాటించాలని సూచిస్తున్నారు. భూమిలో ప్రతీ ఫసల్‌కు ఒకే పంట పండిస్తే నేలలోని పోషకాలు పంటకు సరిగ్గా అందవు. అలాగే విభిన్న పంటలు రకరకాల పోషకాలను వినియోగించుకుంటాయి కాబట్టి అన్ని పోషకాలు వినియోగం కావాలంటే వివిధ పంట లు పండించాలి. ఒకే పంటను పండిస్తే రసాయన ఎ రువుల వినియోగం పెరుగుతుంది. అలాగే నేల సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఒకేపంట సాగుతో దిగుబడి కూడా పడిపోతుంది. ఈ వేసవిలో పంట మార్పిడిపై రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని ఏవో రవినాథ్ తెలిపారు. సాగు మెలకువలు వివరించారు.



పంటల మార్పిడి... ప్రయోజనాలు

ప్రతీ పంటకు భూమిలో అన్ని రకాల సూక్ష్మధాతువుల వినియోగం పూర్తికావాలంటే కొన్నిసార్లు గుబురు వేరు మొక్క పంటలు, మరో పంటకు తల్లివేరు రకం పంటలను సాగు చేయాలి. వరి, పొద్దు తిరుడుగు, టమాట, మిరప తదితర పంటలు గుబురువేరు మొక్కలు కలిగిన పంటలు. అలాగే మొక్కజొన్న, పత్తి, కంది, నువ్వులు, పజ్జొన్న, పెసర, కాకర, దోస, బీర, చిక్కుడు వంటి ఆహార, కూరగాయ పంటలు తల్లివేరు మొక్కల పంటలు. అలాగే ఒకే రకం పంటల్లో శిలీంద్ర రోగాలు, కీటకాలు ఎక్కువ ఆశిస్తాయి. పంటమార్పిడితో రోగాలు అన్ని పంటలకు రావు. పంట మార్పిడితో సహజంగా కొన్ని రకాల పురుగులు, కలుపు మొక్కలు నేలలో నాశనం అవుతాయి. మొక్కలు ఏపుగా పెరుగుతాయి. వేసవి దుక్కులతో పంటలను ఆశించే పురుగులు ఎండ వేడికి చనిపోతాయి. సేంద్రియ పదార్థం పెరిగి భూ భౌతిక స్థితి గణనీయంగా మెరుగుపడుతుంది. మొక్కలకు నత్రజని వినియోగం తగ్గుతుంది.

రైతులు ఇవి పాటించాలి

దీర్ఘకాలిక పంటలు సాగుచేసే పొలాల్లో పంట మార్పిడి కింద స్వల్పకాలిక పంటలైన కూరగాయలు సాగు చేయాలి. లెగ్యూమ్‌జాతి పైర్లు వేస్తే రైజోబియం బుడిసెలు ఏర్పడతాయి. ఈ మొక్కలు పచ్చిరొట్ట ఎరువుగా మారేందుకు భూమిలో కలియదున్నాలి. చిక్కుడు జాతి మొక్కలతో నేలలో భూసారం పెరుగుతుంది. ఒకసారి జొన్న వేస్తే మరుసటి ఏడాది ఆముదం లేదా కంది, మొక్కజొన్న వంటి పంటలు వేసుకోవాలి. రెండు సార్లు దీర్ఘకాలిక పంటలేస్తే మరోమారు స్వల్పకాలిక పంటలైన కూరగాయల సాగుచేయాలి. వరి తరువాత పప్పు దినుసులు సాగుచేసుకోవాలి. దీనితో నేలలో నెమబోధ సంఖ్య తగ్గుతుంది. తేలిక భూముల్లో నీటిపారకం కింద వేరుశనగ లేదా చిక్కుడు పంటలు వేసుకోవాలి. బెండ, బీర, దొండలాంటి పంటల తర్వాత బంతి పూలు, నువ్వులు వేసుకోవాలి. వయ్యారిభామ కలుపు మొక్కల నివారణకు గడ్డిజాతి మొక్కలు సాగు చేయాలి. తక్కువ సారముండే భూముల్లో జనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు వేసి మొక్కల పూత సమయంలో భూమిలో కలిసేలా నాలుగు సాళ్లు దున్నాలి.


రవినాథ్, ఏవో

ఇలా చేయొద్దు...

వేరుశనగపైరు తీసి మరలా వేరుశనగ పంట అస్సలు వేయొద్దు. ఇలా చేస్తే ఎర్రగొంగళి పురుగు, శనగపచ్చపురుగు, లద్దె పురుగు, ఆకుమచ్చ తెగులు, మువ్వ కుళ్లు తెగుళ్లు ఉధృతంగా వస్తాయి. బెండ తరువాత పత్తిపంట వేయాలి. నులిపురుగులు ఉండే ప్రాంతంలో వంగ, బెండ, టొమాటో, ఉలవ, మినుము, పెసర పంటలేసుకోవాలి. తేలిక నేలలు, ఎర్ర, ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి. ఎర్రబంకమట్టి నేలలు, రేగడి నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి.

అంగట్లో పనిముట్లు

రైతులకు తొలగిన ఇక్కట్లు!

పరిగి, మే 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులకు వ్యవసాయ పనిముట్లు తప్పనిసరి. గతంలో రైతులు గొడ్డలి, కొడవలి, కమ్మకత్తి, ఎరుకల కత్తి, దంతెకాళ్ల వంటి పరికరాలను కమ్మరుల కొలిమి వద్ద చేయించుకునే వారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్లల్లోనే అన్ని రకాల పనిముట్లు, వస్తువులు రేడీమేడ్‌గా లభ్యమవుతున్నాయి. గతంలో వడ్రంగి, కమ్మరి వంటి కుల వృత్తుల వారి దగ్గరికి వెళ్లేవారు. ఇప్పుడు వృత్తి పనివారి దగ్గరికి వెళ్లాల్సిన పరిస్థితి లేదు. అన్ని రకాల పనిముట్లు మార్కెట్‌లో లభ్యం అవుతున్నాయి. ముఖ్యంగా వారాంత అంగళ్లలో వ్యవసాయ ఇనుప పనిముట్లు భారీగా అమ్ముతున్నారు. ఇళ్లలో, పొలా ల్లో వినియోగించే పనిముట్లు పరిగి మార్కెట్లో లభ్యమవుతున్నాయి. పనివారి చుట్టూ తిరిగే పని లేకపోవడంతో రైతులకు ఇది సౌలభ్యంగా ఉంది. తయారు చేయించుకునే సమయం వారికి కలిసి వస్తోంది.

గొడ్డళ్లు: వీటితో పొలాల్లో ముళ్లచెట్లు, పొదలను నరుకుతారు. అలాగే పొయ్యిల కట్టెలు కొట్టేందుకు ఉపయోగిస్తారు. గొర్ల కాపరులు చెట్ల కొమ్మలు నరుకుతారు. వీటి ధర రూ.250 నుంచి రూ.350 వరకు ఉంది.

కర్లు: నేలను దున్నేందుకు ఉపయోగించే నాగళ్లకు తోడుగా కర్లను ఉపయోగిస్తారు. నాగలి ముందు భాగంలో ఉంచితే నేలను సునాయసంగా దున్నవచ్చు. వీటిని ఒక్కటి రూ.90 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు.

కొడవళ్లు: వీటిని పలు రకాల పంటలను కోసేందుకు ఉపయోగిస్తారు. ఒక్కోటి రూ.150 నుంచి రూ.250 వరకు అమ్ముతున్నారు. వెంటనే ఉపయోగానికి వీలుగా పిడి వేసి ఉంచుతున్నారు.

కలవార: పంట పొలాల్లో వచ్చే కలుపు మొక్కలను తొలిగించేందుకు ఉపయోగిస్తారు. వీటిని రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తారు.

గుంటుక పలుగులు: పంట పొలాల్లో విత్తనాలు విత్తేందుకు ముందు నేలను చదను చేసుకునేందుకు గుంటుకకు పలుగులను ఉపయోగిస్తారు. వీటిని ఒక్కోటి రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు.


కొడవళ్లు


గొడ్డళ్లు

పారముట్లు(వడ్డెపార): వీటిని పంట పొలాల్లో కాలువలు చేసేందుకు, వొడ్లు నరికేందుకు ఉపయోగిస్తారు. వీటిని రూ.200 వరకు విక్రయిస్తారు.


పరిగి మార్కెట్‌లో విక్రయిస్తున్న వ్యవసాయ పనిముట్లు

మటన్ కత్తి: వీటిని మాంసాన్ని ముక్కలుగా చేసేందుకు ఉపయోగిస్తారు. వీటి ధర రూ.80 నుంచి రూ.100.

సేర్లు: వీటిని కొలతలుగా ఉపయోగిస్తారు. వీటిని ధాన్యం కొలతలకు వాడుతుంటారు. ఒక్కోటి రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు.

పెంకలు: వంటింట్లో రొట్టెలు చేసేందుకు ఉపయోగిస్తారు. రూ.120 నుంచి 200కు అమ్ముతున్నారు.

అన్ని పనిముట్లు దొరుకుతున్నాయి



గతంలో ఏ పనిముట్టుకైనా వృత్తిపని వారి చుట్టూ తిరిగేవాళ్లం.ఎక్కువమంది రైతులం వెళ్తుండడంతో వారికి డిమాండ్ ఉండేది. వ్యవసానికి ఏ పనిముట్టయినా చేయించుకునేందుకు వారం పట్టేది. ఇప్పుడు మార్కెట్‌లో అన్ని పనిముట్లు దొరుతున్నాయి. పైసలు పోయినాసరే.. అవసరమైనప్పుడు లభ్యమవుతున్నాయి.

- గోల్యానాయక్, రైతు నజీరాబాద్ తండా

ఎప్‌సెట్‌లో విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు


కె.ప్రణవ్ తేజ


అభినవ్‌రెడ్డి


విశ్వక్


ఆర్.చందన

పరిగి/యాలాల/చౌదరిగూడ/షాద్‌నగర్ అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆదివారం ప్రకటించిన ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ(ఎప్‌సెట్) ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. పరిగి పట్టణ పరిధి టీచర్స్ కాలనీలో ఉండే టీచర్ కనకం గౌరీశంకర్ కుమారుడు కె.ప్రణవ్ తేజ 128.71/160 మార్కులతో రాష్ట్రస్థాయి 45వ ర్యాంక్ సాధించాడు. యాలాల మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నర్సిరెడ్డి కుమారుడు జి.అభినవ్‌రెడ్డి 447వ ర్యాంకు సాధించాడు. గ్రామస్తులు అతడికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట్‌కు చెందిన మందారం మంజుల, శ్రీనయ్య దంపతుల కుమారుడు విశ్వక్ టీజీ ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగంలో 110 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 213వ ర్యాంక్ సాధించాడు. సివిల్ సాధించమే తన లక్ష్యం అని ఈ సందర్భంగా విశ్వక్ తెలిపాడు. షాద్‌నగర్ విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఆర్.చందన 1,505వ ర్యాంక్‌ను సాధించింది. చందనను కళాశాల ప్రిన్సిపాల్ వి.విశ్వనాథ్ అభినందించారు.

మానవాళికి భగవద్గీత మార్గదర్శకం

మేడ్చల్ టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): మానవాళికి భగవద్గీత మార్గదర్శకమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు అన్నారు. సేవా సమితి సభ్యులు మేడ్చల్ పట్టణంలోని బాలాజీనగర్ కాలనీలో ఆదివారం భగవద్గీత ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక హైదరాబాద్ కమిటీ సభ్యుడు సీహెచ్.గిరి, ఎన్ఎస్.కుమార్, మధు, నర్సింహాచారి, చంద్రకళ, నాగమణి, పద్మ, స్వప్న పాల్గొన్నారు.



పట్టణంలో భగవద్గీత ప్రచారాన్ని నిర్వహిస్తున్న ప్రబోధ సమితి సభ్యులు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- నేడు 300 పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవం
- ప్రారంభించనున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

వికారాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి):ఏళ్లుగా ఎదురు చూసిన సమయం రానే వచ్చింది. వికారాబాద్ జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు నిర్మించిన 300 పడకల ఆసుపత్రి సోమవారం ప్రారంభం కానుంది. కొత్త భవనంలో 300 పడకలు, క్రిటికల్ కేర్‌లో 50పడకలు, పాత ఆసుపత్రితో కలిపి మొత్తం 400 బెడ్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రజలకు స్పెషాలిటీ వైద్య సేవలు అందనున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ, స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా 300 పడకల ఆసుపత్రిని నేడు ప్రారంభించనున్నారు.

తీరనున్న కష్టాలు

గతంలో వికారాబాద్‌లో ఉన్న కమ్యూనిటీ ఆసుపత్రిలో ఎక్కువ పడకలు, సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎద్కున్నారు. ఎమర్జెన్సీ సర్వీసులను వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేసే వారు. వికారాబాద్ జిల్లా కేంద్రంగా మారడంతో 100 పడకల ఆసుపత్రి నిర్మించాలని మొదట్లో రూ.9.50కోట్లతో నిర్మాణం చేపట్టారు. అనంతరం వికారాబాద్‌కు మెడికల్ కాలేజీ రావడంతో వంద పడకల ఆసుపత్రిని 300 పకడలకు పెంచాలని నిర్ణయించి ఇందుకు మరో రూ.30కోట్లు వెచ్చించి ఆసుపత్రిని నిర్మించారు. ఇందులో ఆస్పత్రి మొదటి, రెండో అంతస్తు నిర్మాణానికి రూ.23.75కోట్లతో పనులను చేశారు. క్రిటికల్ కేర్ యూనిట్‌కు రూ.16కోట్లతో నిర్మాణ పనులు కొనసాతున్నాయి.


ప్రారంభ వేడుక కోసం తెచ్చిన పూలు

అనంతగిరిలో ప్రస్తుతం వైద్య కళాశాల

వికారాబాద్‌కు ఆరు కిలో మీటర్ల దూరంలో అనంతగిరి టీబీ ఆసుపత్రిలో తాత్కాలికంగా వైద్య కళాశాలను కొనసాగిస్తున్నారు. అయితే మేకల గండిలో నూతన వైద్య కళాశాల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. విద్యార్థులకు ప్రాక్టికల్ కోసం ప్రస్తుతం ప్రారంభమవుతున్న 300 పడకల ఆసుపత్రిని వినియోగించనున్నారు. వైద్య కళాశాలలో 56 మంది డాక్టర్లు, 38మంది బోధకలున్నారు. 55 మంది నర్సులు అందుబాటులో ఉన్నారు. క్షయ ఆసుపత్రి విభాగాల నర్సులు 30మంది ఉన్నారు. వికారాబాద్‌లో వైద్య కళాశాల 2023లో మంజూరు కాగా సెప్టెంబరులో ప్రారంభించారు. 100 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించగా ప్రస్తుతం వారు మూడో సంవత్సరం చదువుతున్నారు.

స్పెషాలిటీ వైద్య సేవలు

వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇక్కడ అన్ని రకాల ఆపరేషన్లు, ఆర్థో సేవలు రానున్నాయి. పాము కరిచినా అందుకు తగ్గ వైద్య సేవలు అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఐసీయూ, వెంటిలేటర్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. సూపర్ స్పెషాలిటీ సేవలు తప్ప మిగితా అన్ని రకాల ఆపరేషన్లు, సేవలను ఇక్కడ వైద్యులు అందిస్తారు. అధునాతన యంత్ర పరికరాలను అమర్చారు.

రైల్వే లెవల్ క్రాసింగ్, నీటి వ్యవస్థ సమస్య..

వికారాబాద్‌లో అన్ని రకాల సేవలతో ప్రారంభమవుతున్న ఆసుపత్రికి ప్రస్తుతం రైల్వే ట్రాక్, మంచినీటి సమస్యలే కన్పిస్తున్నాయి. ఆసుపత్రికి వెళ్లే మార్గంలో రైల్వే ట్రాక్ ఉండడంతో రైల్వే గేటు పడితే అరగంట వేచి ఉండాలి. మంత్రులు, వచ్చిన ముఖ్యమంత్రి వచ్చిన వికారాబాద్ తాండూరు వెళ్లాలంటే ఈ రైల్వే గేటు దాటాల్సిందే. దీంతో ఎమర్జెన్సీ సేవలకు ఇబ్బంది కలగనుంది. ఎమర్జెన్సీ కోసం వికారాబాద్ పాత ప్రభుత్వ ఆసుపత్రిని ఉపయోగిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అస్పత్రిలో నీటి సమస్య తీర్చాలంటే మిషన్ భగీరథ పైపులైన్ వేయాల్సి ఉంది.

స్పెషాలిటీ సేవలు అందిస్తాం

నేడు ప్రారంభమయ్యే ప్రభుత్వ ఆసుపత్రి 300పడకలు ఉంటాయి. స్పెషాలిటీ వైద్యసేవలు ప్రజలకందుతాయి. రైల్వే గేటు విషయంలో ఎమర్జన్సీ సేవలపై అధికారులతో చర్చిస్తాం. అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.

- రాంచంద్రయ్య, అస్పత్రి సూపరింటెండెంట్, వికారాబాద్


పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

కడ్తాల్, మే11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలు మెరుగైన వసతులు కల్పించి పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నదని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలోని 12,13 వార్డులలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10లక్షలతో నిర్మిస్తున్న అంతర్గత మురుగు కాల్వ నిర్మాణం పనులను ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పనులను నాణ్యతగా, వేగంగా పూర్తిచేయాలని సూచించారు. కడ్తాల మండలంలో ఎస్సీ సబ్ ప్లాన్‌నిధులతో 28పనులను 1.30 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఆ నిధులతో ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మిస్తున్నట్లు చెప్పారు. పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రదాన కార్యదర్శి రాజేశ్, మాజీ సర్పంచ్ చెన్నయ్య, నాయకులు మంకి శ్రీను, రమేశ్, శ్రీకాంత్, రామకృష్ణ, నరేశ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే!

- నేలవాలిన విద్యుత్ వైర్లు
- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని సంబంధిత అధికారులు


నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో నేలవాలి ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలు

కీసర రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో విద్యుత్ తీగలు నేల వాలి ప్రమాదకరంగా మారాయి. రాంపల్లి నుంచి ఘట్‌కేసర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఈ ప్రమాదం పొంచి ఉంది. దీంతో వాహనదారులు భయ భ్రాంతులకు గురౌతున్నారు. నిత్యం వేలాది వాహనాలు ఈ దారి గుండా వెళ్తుంటాయి. అనేక మంది కాలినడకన వెళ్తుంటారు. ఏమాత్రం ఏమరపాటుగా వెళ్లినా విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. ఇదే విషయమై సంబంధిత అధికారులకు స్థానికులు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్యను పరిష్కరించటం లేదని ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు చొరవ తీసుకుని విద్యుత్ వైర్లను సరి చేయాలని కోరుతున్నారు.

రోడ్డంతా సోయగమే!

ఘట్‌కేసర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని ఔటర్ రింగ్‌రోడ్డు జంక్షన్‌లోని సర్వీసు రోడ్లకు ఇరువైపుల గతంలో నాటిన మొక్కలు నేడు చెట్లయ్యాయి. ఇందులో గుల్‌మొహర్ రకం చెట్లు కాషాయవర్ణం పూలతో నిండిపోయాయి. మండేఎండల్లో కిలోమీటర్ దూరం నుంచే కనువిందు చేస్తున్నాయి. మే మాసం ఎండలు మండుతున్నా ఈ పూల సోయగాన్ని చూసిన పలువురు వాహనదారులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. కొందరు సెల్ఫీలు దిగుతున్నారు. మరికొందరు ఆ చెట్లకింద కూర్చొని కాసేపు సేదతీరుతున్నారు. ఇంకొందరైతే ఈ పూలను కోసి మురిసిపోతూ వెంట తీసుకెళ్తున్నారు.


యంనంపేట్‌లో కాషాయ రంగుపూలతో నిండిన చెట్లు


ఘట్‌కేసర్‌లోని ఔటర్ సర్వీసు రోడ్డులో..

ఉపాధిపై నిఘా!

(ఐదో పేజీ తరువాయి)

తీసుకున్నారని ఆరోపణలున్నాయి. బాధ్యులపై సస్పెన్షన్ వేటు వేసినా ఆ తర్వాత కొద్ది రోజులకే వారు తిరిగి విధుల్లో చేరుతున్న విషయం తెలిసిందే. అక్రమాలకు పాల్పడిన వారి నుంచి నామమాత్రపు రికవరీతో సరిపెడుతున్నారు. ఉపాధి హామీ పనుల్లో మార్గదర్శకాలను పాటించడం లేదని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పని రోజుల్లో భారీగా కోత విధించింది. గతేడాదిలో కూలీలు పూర్తి చేసుకున్న పని రోజులతో పోలిస్తే జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో సగానికి సగం పని రోజులను తగ్గించారు. గత ఆర్థిక సంవత్సరంలో వికారాబాద్ జిల్లాకు 66.27 లక్షల పని రోజులు కేటాయించగా, ఈసారి 33.61 లక్షల పని రోజులు మాత్రమే కేటాయించడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఉపాధి హామీ పథకం పనులను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు నిఘా పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కమిటీల ద్వారా ఉపాధి పనుల్లో పారదర్శకత పెరగనుంది. కూలీల హాజరుతో పాటు చేపట్టే పనుల్లోనూ జవాబుదారీతనం పెరిగే అవకాశం ఉంది.

ప్రతివారం క్షేత్రస్థాయిలో తనిఖీలు

నిఘా పర్యవేక్షక కమిటీలో మండల ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం, స్వచ్ఛంద సంస్థ, ఉపాధి కూలీల్లో నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సభ్యులు క్షేత్ర స్థాయిలో జరిగే ఉపాధి హామీ పనులను వారానికి ఒకసారి పరిశీలిస్తారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల మంజూరు, పనుల నిర్వహణ తీరు, కూలీల హాజరు, వేతనాల చెల్లింపులు వంటి వివరాలను పరిశీలించాల్సి ఉంటుంది. చేపట్టిన పనులు పారదర్శకంగా కొనసాగాయా, లేదా? అనేది వారు గుర్తించనున్నారు. ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన తర్వాత ఆ వివరాలను కమిటీ ఎంపీడీవోకు పంపించాల్సి ఉంటుంది. పంచాయతీ స్థాయిలో కమిటీల నుంచి తమకు వచ్చే పనుల తనిఖీ నివేదికలను ఎంపీడీవోలు కలెక్టర్‌కు పంపించనున్నారు. పనుల నిర్వహణ తీరు, నివేదికల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోనున్నారు. తనిఖీల్లో ఏమైనా అవకతవకలు జరిగినట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటారు. నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే ఆలస్యం చేయకుండా వెంటనే రికవరీ చేసేలా చర్యలు చేపడతారు.

భోజ్యానాయక్‌తండాలో కొత్తబోరు


పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ శాంతి, తండావాసులు

బషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోజ్యానాయక్‌తండాలో ఎమ్మెల్యే ఆదేశాలతో ఆదివారం కొత్తగా బోరు వేయించారు. తండాలో నీటి సమస్యపై మాజీ సర్పంచ్ శాంతి మాజీ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై మాజీ ఎంపీపీ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి వివరించారు. ఎమ్మెల్యే సహకారంతో బోరుబండిని తండాకు రప్పించి కొత్తగా బోరు కోసం డ్రిల్లింగ్ చేయించారు. ఈ బోరుతో నీటి సమస్య పరిష్కారమవుతుందని తండావాసులు పేర్కొన్నారు. ఈ బోరు డిల్లింగ్ పనులను మాజీ సర్పంచ్ ప్రారంభించి పూర్తయ్యే వరకు దగ్గరుండి పర్యవేక్షించారు.

సొసైటీకి రూ.50లక్షల పంట రుణం

బషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): నవాంద్గీ సొసైటీకి రూ.50లక్షల పంట రుణాలు మంజూరైనట్లు చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌కు గానూ మొదటి విడతగా రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు డబ్బులు వచ్చాయన్నారు. డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య సహకారంతో సొసైటీ మరిన్ని పంట రుణాలు తీసుకువస్తామన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

తాండూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడమే ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ జాబితా ప్రకారం కాకుండా అనర్హులకు కాంగ్రెస్ నాయకులకు కేటాయిస్తున్నారని ఆరోపించారు. గ్రామపంచాయతీ కార్మికులకు, అంగన్‌వాడీలకు, ఆశావర్కర్లకు, దివ్యాంగులకు, వితంతులకు మొదటి ప్రాధాన్యతగా ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో రీసర్వే చేసి అర్హులైన వారికి ఇళ్లు కేటాయించకపోతే మండల కార్యాలయాల వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్, మే 11 (ఆంధ్రజ్యోతి): యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని అన్నిరంగాల్లో రాణించేందుకు నిరంతరం శ్రమించాలని ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధి మీసాల అరుణ్‌కుమార్, చెంగిచెర్ల ఆర్టీసీ కంట్రోలర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులోగల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల నక్సల్స్ మందుపాతరలో మృతిచెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ తిక్క సందీప్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దాసు, రాములు, రాజేష్, అంజనేయులు, జగదీష్ సురేష్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: యువత అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలని అంబేడ్కర్ సంఘం మండల నాయకుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. లాల్‌గడి మలక్‌పేటలోని గ్రౌండ్స్‌లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14 నుంచి మే 11 వరకు బీఆర్ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ప్రీమియం లీగ్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్ క్రీడాపోటీలను విజయంతంగా నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఆదివారం లాల్‌గడి మలక్‌పేటలో అలియాబాద్‌కు చెందిన అంబేడ్కర్ సంఘం మండల నాయకుడు వెంకటేశ్, లాల్‌గడి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ నాయకుడు నర్సింగ్‌రావులు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

నత్తే నయం!

(ఐదో పేజీ తరువాయి)

జాప్యం, నాణ్యతలేని కారణంగా పగుళ్లు రావడంతో ప్యాచ్ వర్క్ చేశారు. ప్రహరీ అయితే కొంత భాగం నిర్మించి వదిలేశారు. నిర్మాణ దశలోనే కూలిపోయేవిధంగా ఉందని, ఈ పనులపై అధికారుల పర్యవేక్షణ లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన ఆస్పత్రి కమిటి సమావేశంలో పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించినా పనుల్లో వేగం పెరగలేదు.


రూ.30లక్షల వెచ్చించినా పనిచేయని జనరేటర్

నిధులు వెచ్చించినా సేవల్లోకి రాని వైనం

పరిగి ఆస్పత్రిలో రూ.30 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జనరేటర్ వినియోగంలో లేదు. జనరేటర్ ఉన్నా విద్యుత్ సరఫరా లేనిసమయంలో రోగులు చీకట్లో గడపాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త మార్చురీ నిర్మాణం కోసం పాతదాన్ని కూల్చివేశారు. ప్రస్తుతం వేరే గదిలో మార్చురీ నిర్వహిస్తున్నారు. కొత్తభవనం అందుబాటులోకి రానికారణంగా మృతదేహాలను ఒక రోజు ఉంచడానికి వీల్లేకుండా ఉంది. కొత్త భవనం రెండేళ్లుగా అసంపూర్తిగానే ఉంది. ఈ భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇసుకకు బదులు డస్ట్‌నే వినియోగించారని స్థానికులు చెబుతున్నారు. రూ.లక్షలు వెచ్చించినా అధికారుల నిర్లక్ష్యం, గుత్తేదార్ల అలసత్వం వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని వాపోతున్నారు.


నాణ్యత లేకుండా నిర్మాణం



నిత్యం అడుగుతూనే ఉన్నాం



పనులు పూర్తి చేయాలని నిత్యం గుత్తేదారుపై ఒత్తిడి తెస్తున్నాం. జనరేటర్ మెయింటనెన్స్‌కు నిధుల సమస్య ఉంది. ఒక భాగం కాకుండా ఆస్పత్రి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. మార్చురీ గదులను త్వరగా పూర్తి చేసి ఇవ్వాలని కోరుతున్నాం.

\- రాజశేఖర్, ఆస్పత్రి సూపరింటెండెంట్, పరిగి

త్వరలోనే పనులు పూర్తవుతాయి



నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. టెండర్‌లో తీసుకున్న గుత్తేదారు జనరేటర్ ఏర్పాటు చేసి మిగతా పనులను సబ్ గుత్తేదారుకు అప్పగించాడు. భవన నిర్మాణం పూర్తి దశకు వచ్చింది. ప్రహరీ నిర్మించాల్సి ఉంది. పనుల్లో నాణ్యత లేకుంటే రికార్డు చేయం. త్వరలోనే అన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం

\- డి.లక్ష్మీనారాయణ, డీఈఈ ఆరోగ్యశాఖ

సైన్యానికి మద్దతుగా ప్రత్యేక పూజలు


వికారాబాద్: బుగ్గ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సదానందారెడ్డి, బీజేపీ నాయకులు

వికారాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి) : భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం, సైన్యానికి మద్దతుగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బుగ్గ రామలింగేశ్వరాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రస్తుత సమయంలో ప్రజలందరూ భారత ప్రభుత్వానికి అండగా నిలువాలని, అదే విధంగా అంతర్గతంగా ఉన్న దేశ విచ్ఛిన్నకర శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సోషల్ మీడియాలో వస్తున్న అపోహలను నమ్మవద్దని, దేశ శ్రేయస్సు కోసం పాటు పడుతున్న ప్రధాని మోడీకి మనం అండగా ఉండాలన్నారు. బుద్ధి మారని పాకిస్తాన్‌కు మన దేశ సైన్యం సమర్ధవంతంగా తగిన జవాబు ఇస్తుందని చెప్పారు. దేశ రక్షణ పరంగా ఇండియా చాలా బలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు శివరాజ్ గౌడ్, నాయకులు పడమటి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని కేసారంలో వేద హిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాగం, ప్రత్యేక పూజల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి విజయం సాధించడానికి యాగం నిర్వహించడం పట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు పీఎం శర్మను అభినందించారు.


యాగంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

అమరవీరులకు బీఆర్‌ఎస్ నేతల నివాళి


వీరజవాన్లకు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వికారాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): భారత్-పాక్ యుద్ధంలో భారత సైనికులు వీరమరణం పొందిన జవాన్లకు బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొని అమర వీరులకు పువ్వులు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు కట్టమైసమ్మ జాతర

శామీర్‌పేట, మే 11 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ అమ్మవారు జాతరను సోమవారం(నేడు) నిర్వహించనున్నారు.. ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌యాదవ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి జాతర ఉత్సవాలను అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ తెలిపారు. ఈ సారి కట్టమైసమ్మ జాతర ఉత్సవాల్లో లోకకళ్యాణం, భక్తుల కోసం ఆలయ వద్ద భవిష్యవాణిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

నేడు పరిగికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాక

- ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన

పరిగి, మే 11 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి రూ.27కోట్లతో నిర్మించనున్న కొత్త భవన నిర్మాణానికి సోమవారం ఉదయం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగి ఆస్పత్రి 30 బెండ్ల నుంచి 100 బెండ్ల ఆస్పత్రిగా మార్చబోతున్నామని తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రితోపాటు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధాంతి పార్థసారథి, ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, ప్రధానకార్యదర్శి కె.హన్మంత్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, నాయకులు పాలాది శ్రీనివాస్, ఎ.గోపాల్, జగన్ పాల్గొన్నారు.

అసత్య పోస్టులు చేస్తే చర్యలు

కీసర రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్తాన్ యుద్ధం, మతపరమైన, అసత్యవార్తలు సోషల్ మీడియాలో పోస్టు చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. కీసర పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు నాగరాజు, వెంకటేష్, వెంకట్‌నారాయణ, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహ స్వామి జయంతి

కీసర, మే 11 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనృసింహస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన వేడుకల్లో భాగంగా చీర్యాల్ శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలోని గర్భాలయంలోని మూలవిరాట్‌కు ఆలయ నిర్వహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యల్లో విచ్చేసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్‌లు భక్తులకు అన్నదానం చేశారు.


భక్తులతో కిటకిటలాడుతున్న చీర్యాల్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం

నిజాంపేట్ మేడిపల్లి మాజీ సర్పంచ్ మృతి

పూడూరు, మే 11, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజాంపేట్ మేడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చిట్యాల పెంటమ్మ(68) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. పెంటమ్మ పదేళ్లపాటు గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో ఎన్నో మంచి పనులు చేశారని పలువురు గుర్తు చేశారు. ఆమె మృతి పట్ల గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

వధూవరులకు ప్రముఖుల ఆశీర్వాదం


యాలాల: వివాహ వేడుకలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, మే 11 (ఆంధ్రజ్యోతి): తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇ.నర్సింహులుగౌడ్ కుమార్తె వివాహం ఆదివారం కోస్గిలో జరిగింది. ఈ వివాహానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పి.బాల్‌రెడ్డి, యాలాల పీఏసీఎస్ చైర్మన్ జి.సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నర్సిరెడ్డి, పట్లోళ్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: కొడంగల్‌లో ఆదివారం జరిగిన వివాహ వేడుకలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ పాల్గొన్నారు.


వివాహ వేడుకలో తిరుపతిరెడ్డి, నాయకులు

క్రైం కార్నర్

బావిలో పడి గుర్తుతెలియని మహిళ మృతి



వికారాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): బావిలో పడి గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని ఆలంపల్లి సమీపంలోని ఓబావిలో గుర్తుతెలియని మహిళ(40) బోర్లాపడి నీటిపై తేలి కన్పించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మహిళ ఒంటిపై ఎరుపురంగు పూలచీర, చాక్లెట్ రంగు జాకెట్ ధరించి, ఎరుపు రంగు టవల్ వద్ద రెడ్‌కలర్ టవల్ ఉంది. ఎవరికైనా మహిళ సమాచారం తెలిస్తే వికారాబాద్ పోలీసులకు 8712670030, 8712670031 నెంబర్‌కు డయల్ చేయాలని సీఐ భీమ్ కుమార్ తెలిపారు.

శామీర్‌పేట్ చెరువులో మహిళ మృతదేహం లభ్యం

మూడుచింతలపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ మృతదేహం లభ్యమైన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. రసూల్‌పురకు చెందిన కాయితపురం సుశీల(60) గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. శనివారం పనికి వెళ్తున్నానని బయటకు వెళ్లిన ఆమె ఆదివారం శామీర్‌పేట్ చెరువులో శవమై కనిపించింది. మృతురాలి కొడుకు రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరాంచారు.

ఆటో, బైకు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

తాండూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆటో, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన తాండూరు మండలం అల్లాపూర్-తాండూరు మార్గమధ్యలో జరిగింది. కరన్‌కోట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం షేక్ నిజాముద్దీన్, ఖాజామియాలు బైక్‌పై అల్లాపూర్ నుంచి తాండూరు వెళుతున్నారు. చెంగోల్ శివారులోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద వస్తుండగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో వీరి బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న షేక్ నిజాముద్దీన్, ఖాజామియాలకు, ఆటోలో ఉన్న ముగ్గురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై వస్తున్న వ్యక్తులను తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. గాయపడిన మహిళలను ఆటోలో మరో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కరన్‌కోట్ పోలీసులు తెలిపారు.

కారు బోల్తా.. తప్పిన పెను ప్రమాదం

దుద్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): కారు బోల్తాపడగా తృటితో పెను ప్రమాదం తప్పింది బొంరాస్‌పేట్ మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన కావలి రాజు, పాస్ల సిద్ధు కారులో కోస్గి నుంచి చౌదర్‌పల్లికి ఆదివారం సాయంత్రం వెళ్తుండగా దుద్యాల మండలంలోని ఈర్లపల్లి గ్రామ శివారులో కారు విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న రాజు, సిద్దుకు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదంలో విద్యుత్ స్తంభం నేలకొరిగి విద్యుత్ తీగలు కిందపడిపోయాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

కుక్కల దాడిలో నెమలి మృత్యువాత


గాయాలపాలై మృత్యువాతపడిన నెమలి

కులకచర్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంనగర్ గ్రామంలో కుక్కల దాడిలో నెమలి మృత్యువాతపడింది.రైతు గొల్ల రాంచంద్రయ్య పొలం దగ్గరకు ఆదివారం మధ్యాహ్నం నీళ్లు తాగేందుకు నెమలి వచ్చింది. అక్కడే ఉన్న ఊరకుక్కలు నెమలిని వెంబడించి దాడి చేయడంతో గాయపడింది. గమనించిన రైతు రాంచంద్రయ్య కుక్కలను తరిమికొట్టి అటవీశాఖ అధికారి మోహిన్‌కు సమాచారం అందించాడు. ఈ క్రమంలో నెమలిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృత్యువాతపడింది. అనంతరం పొలంలోనే పూడ్చిపెట్టారు.

పేకాడుతున్న నలుగురిపై కేసు

బషీరాబాద్, మే11(ఆంధ్రజ్యోతి): పేకాటడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు బషీరాబాద్ ఎస్‌ఐ పి.శంకర్ తెలిపారు. మండల కేంద్రం టాకీ తండా శివారులోని లక్ష్మీమాత టెంపుల్ సమీపంలో ఆదివారం పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.2,900 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మోమిన్‌పేట్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎన్కతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. ఉపాధ్యాయులు మహేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు శారద పాల్గొన్నారు.

చెంగోల్‌లో ప్రీమియర్ లీగ్


విజేత జట్టుకు కప్‌ను అందజేస్తున్న శంకర్ యాదవ్

తాండూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): చెంగోల్‌లో ఆదివారం చెంగోల్ ప్రీమియర్ లీగ్ 9వ సీజన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. చిన్నెలి శ్రీనివాస్‌యాదవ్ పేరున ఆయన కుటుంబ సభ్యులు అమల శ్రీనివాస్‌యాదవ్, అరవింద్ యాదవ్, ఐశ్వరయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఈ లీగ్ నిర్వహించారు. లీగ్‌లో చెంగోల్ బ్లూ జట్టు మొదటి స్థానంలో, చెంగోల్ ఎల్లో రెండో స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమానికి సాయిపుత్ర హోంసీడ్స్ అధినేత భావనోళ్ల శంకర్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేత జట్టుకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు వేణుగోపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, మనోహర్‌యాదవ్, బంటు మల్లప్ప, రాము యాదవ్ పాల్గొన్నారు.